రైలు బండి.. వేళకు రాదండి!

- పాతబస్తీలో సమయపాలన పాటించని ఎంఎంటీఎస్‌లు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- దృష్టి సారించని అధికారులు


ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌లో ఎంఎంటీఎస్ రైలు వద్ద ప్రయాణికులు

చార్మినార్: పాతబస్తీలో నడిచే ఎంఎంటీఎస్ రైళ్లు సమయపాలన పాటించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాతబస్తీ నుంచి నగరంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి నేరుగా సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో అధిక శాతం మంది ఎంఎంటీఎస్ రైళ్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో పాతబస్తీలో ఎంఎంటీఎస్‌కు డిమాండ్ అధికంగా ఉంది. అయితే ఎంఎంటీఎస్ రైళ్లు మాత్రం నిర్దేశిత సమయానికి రాకుండా ఆలస్యంగా నడుస్తుండడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. పాతబస్తీ పరిధిలోని ఫలక్‌నుమా, ఉప్పుగూడ, యాకుత్‌పురా, డబీర్‌పురా, మలక్‌పేట తదితర రైల్వేస్టేషన్ల పరిధిలో నిత్యం వేలాది మంది రైళ్లలో రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం వేళల్లో మాత్రమే సమయానికి వచ్చే రైళ్లు తదనంతరం సమయపాలన పాటించడం లేదు. దీనిపైనే ఆధారపడిన ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు.

సాయంత్రం వేళలో సమస్య తీవ్రం..

- సాయంత్రం సమయంలో ఈ సమస్య మరీ తీవ్ర తరంగా మారింది. దీంతో ఉద్యోగాలు, కళాశాలల నుంచి ఉద్యోగులు, విద్యార్థులు రైలులో ప్రయాణించలేక నరకం అనుభవిస్తున్నారు.
- సాయంత్రం 4 గంటల అనంతరం ఏ రైలు ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. దాదాపు గంట పాటు ఆలస్యంగా రైళ్లు నడుస్తుండడం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది.
- మహిళలు, వృద్ధులు, చిన్నారులు దిగాల్సిన స్టేషన్ వచ్చినప్పుడు దిగలేక ప్రమాదాలకు గురవుతున్నారు.
- సాయంత్రం వేళ రైళ్ల సంఖ్యను రెట్టింపు చేసి నిర్దేశిత సమయాల్లో నడిచేటట్లు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైల్వే ప్రయాణికులు కోరుతున్నారు.

రైల్వే స్టేషన్ల వద్ద నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి..

- పాతబస్తీలోని రైల్వే స్టేషన్ల వద్ద నుంచి తమ తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు అనుసంధానంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.
- కేవలం మలక్‌పేట్ రైల్వే స్టేషన్ వద్ద నుంచి మాత్రమే ఆర్టీసీ బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి తప్పా డబీర్‌పురా, యాకుత్‌పురా, ఉప్పుగూడ తదితర పాతబస్తీలోని మూడు రైల్వే స్టేషన్ల వద్ద నుంచి ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేవు. దీంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు.
- గతంలో ఎంఎంటీఎస్ రైళ్లకు అనుసంధానంగా ఆర్టీసీ బస్సులను అందుబాటులోకి తెస్తామని సంబంధిత అధికారులు ప్రకటించినప్పటికీ.. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అమలు కావడం లేదు. ఇప్పటికైనా పాతబస్తీలోని రైల్వే స్టేషన్ల వద్ద నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

చారిత్రక ప్రదేశాలకు నిలయం హైదరాబాద్


మాట్లాడుతున్న ఆర్కిటెక్ మాధవరామన్

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ నగరం గొప్ప కట్టడాలకు, వారసత్వ సంపదకు, చారిత్రక ప్రదేశాలకు నిలయమని ప్రముఖ ఆర్కిటెక్ మాధవ రామన్, జేఎన్ఏఎఫ్ఏయు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కవితా దరియానిరావు పేర్కొన్నారు. ప్రపంచ హెరిటేజ్ డేను పురస్కరించుకుని శుక్రవారం మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆడిటోరియంలో హాల్‌లో ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ వీకే.బవ స్మారకోపన్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాదవ రామన్ మాట్లాడుతూ..వారసత్వ సంపద, పరిరక్షణ, నీటి ప్రాధాన్యాన్ని తెలియజేసేందుకు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నదుల పక్కన ఉండే నగరాలు, రాజధానులు, వారసత్వ సంపద, చారిత్రక కట్టడాలు తదితర విషయాలపై ప్రాధాన్యతను తెలియజేస్తూ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

చిత్రకారుడు అంబాజీ తెలంగాణకే గర్వకారణం

ప్రముఖ సాహితీవేత్త కొలకలూరి ఇనాక్


అంబాజీని సత్కరిస్తున్న కొలకలూరి ఇనాక్, కిషన్ రావు, నర్సింహారెడ్డి

నాంపల్లి: ప్రముఖ చిత్రకారుడు సీవీ అంబాజీ ప్రపంచస్థాయి చిత్రకారుడని, ఆయన తెలంగాణకే గర్వకారణమని సాహితీవేత్త, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ కొనియాడారు. శుక్రవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 38వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పరిపాలనభవన్‌లో చిత్రకారులు సీవీ అంబాజీని విశిష్ట పురస్కారంతో సత్కరించారు. పురస్కారం కింద రూ.లక్ష నగదు, జ్ఞాపికను అందజేశారు. సామాన్య వ్యక్తిత్వంతో అసామాన్య చిత్రాలు గీసే అద్భుత ప్రతిభాశాలి అని ఇనాక్ ప్రశంసించారు. తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు మాట్లాడుతూ..అంబాజీ ఎలాంటి విద్యార్హతలు లేకున్నా తెలంగాణ చిత్రపటాన్ని ప్రపంచస్థాయిలో నిలబెట్టారని ప్రశంసించారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో అద్భుతాలు సృష్టించారని, నిరుపేద చేనేత కుటుంబంలో పుట్టి చిత్రకళలో అంతర్జాతీయఖ్యాతిని ఆర్జించి తెలంగాణకు వన్నె తెచ్చారని అభినందించారు. సీవీ అంబాజీ తన స్పందన తెలియజేస్తూ.. భోజనం చేసేందుకు డబ్బుల్లేని రోజుల్లో రెండు రూపాయల నోటు బొమ్మ గీసిన కాగితం ఇచ్చి గుర్తు పడతారనే భయంతో గబగబా తిని పారిపోయిన రోజుల నుంచి చిత్రకళతోనే ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. చదువులేకున్నా తెలుగు విశ్వవిద్యాలయం నుంచి విశిష్ట పురస్కారం తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కవి, డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ భట్టు రమేశ్, అసిస్టెంట్ డైరెక్టర్ రింగు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎం.శ్రీధర్‌రెడ్డి సాహిత్య పురస్కారానికి మలయశ్రీ ఎంపిక

సుల్తాన్‌బజార్: 1969 తెలంగాణ ఉద్యమకారుడు, కవి, రచయిత డాక్టర్ ఎం.శ్రీధర్‌రెడ్డి పేరుతో తెలంగాణ సారస్వత పరిషత్తులో ఏర్పాటైన సాహిత్య పురస్కారానికి కరీంనగర్‌కు చెందిన శతాధిక గ్రంథకర్త డాక్టర్ మలయశ్రీ ఎంపికయ్యారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన మే 1న పరిషత్తులోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగే సభలో సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మలయశ్రీకి పురస్కారం ప్రదానం చేసి రూ.25 వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరిస్తారని పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ శ్రీధర్‌రెడ్డి సతీమణి డాక్టర్ బి.వి జయలక్ష్మీ, పరిషత్తులో ఈ మేరకు ఎండోమెంటు నెలకొల్పారు.

మేరు కులస్తులకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి


ఆర్.కృష్ణయ్యను సన్మానిస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మేరు కులస్తులకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర మేరు యువజన సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజ్యసభ ఎంపీ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్యన ఆయన సన్మానించి మేరు కులస్తుల పలు డిమాండ్లను తెలిపారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి తాము పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన



డబీర్‌పురా: కోమటివాడి రామాలయంలో శుక్రవారం ఉదయం ప్రభాత పూజ, హారతి, ఉదయం 11 గంటలకు సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కుంకుమార్చనలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి 8 గంటలకు పూజ, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

జియాగూడ: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మధ్యాహ్నం కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రామస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పన్నిపురా ప్రాంతంలో ఉంటున్న ప్రభుత్వ ఉద్యోగి నర్సింగ్, ప్రమీళబాయి కుమారుడు శ్యామ్‌కుమార్(27) హిందుస్తాన్ లీవర్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగి. పదిరోజుల క్రితం చేస్తున్న ఉద్యోగం మానివేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. శుక్రవారం తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పనులకు వెళ్లగా ఇంటి వద్దే ఒక్కడే ఉన్న శ్యామ్‌కుమార్ ఇంట్లో హుక్కుకు చీర కొంగు బిగించి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం వచ్చిన కుటుంబసభ్యులు గడియా తీయకపోవడంతో అనుమానం వచ్చి డోర్‌ను తెరవగా శ్యామ్ కుమార్ ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే అతడిని దించి ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరికి జైలు

సంతోష్‌నగర్: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఇద్దరికి నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.సత్యనారాయణ శుక్రవారం మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి, ఎస్సై లింగరాజు తెలిపిన వివరాల ప్రకారం..కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్‌లో కానిస్టేబుల్ ఆంజనేయులు, హోంగార్డు ఖాజాపాషా శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో గస్తీ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో హఫీజ్‌బాబానగర్ సీ–బ్లాక్‌కు చెందిన మహ్మద్ మాజిద్ (29), జుబేర్ పాషా (26) అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీలు చేస్తుండగా విధులకు ఆటంకం కలిగిస్తూ దుర్భాషలాడారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ–పెట్టీ కేసు నమోదు చేసుకొని శుక్రవారం నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరచగా..పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ ఎస్.సత్యనారాయణ ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు.

హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ముగ్గురికి రిమాండ్

సంతోష్‌నగర్: ఆర్థిక లావాదేవీల కారణంగా ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ముగ్గురు నిందితులను ఐ.ఎస్.సదన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ వెంకట రామయ్య తెలిపిన వివరాల ప్రకారం..బడంగ్‌పేట్‌కు చెందిన నదిరి సాయి కుమార్ (26) కార్ల క్రయ విక్రయాల వ్యాపారం చేస్తుంటాడు. సాయి కుమార్ 2022లో తన సోదరి వివాహం కోసం పెద్ద నాన్న నదిరి శ్రీశైలం కుమారుడైన సంతోష్‌నగర్ కానిస్టేబుల్ మహేశ్ కుమార్ వద్ద రూ.2 లక్షలను తీసుకున్నాడు. తీసుకున్న డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తుండటంతో ఈనెల 18న మహేశ్ కుమార్ సాయి కుమార్ ఇంటికి వెళ్లాడు. అక్కడి సాయి కుమార్‌ను మహేశ్ కుమార్ ఒవైసీ కాలనీలోని శ్మశాన వాటిక ప్రాంతానికి తీసుకొచ్చాడు. అప్పటికే మహేశ్ కుమార్ తండ్రి శ్రీశైలం, సోదరుడు జగదీశ్వర్ అక్కడే ఉన్నారు. సాయి కుమార్ అక్కడికి చేరుకోగానే మహేశ్ కుమార్, శ్రీశైలం, జగదీశ్వర్ కట్టెలతో దాడి చేశాడు. దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన సాయి కుమార్ స్నేహితున్ని సైతం కట్టెలతో కొట్టి గాయపరిచారు. అనంతరం సాయి కుమార్ చంద్రయ్య గుడిసెల్లోకి తీసుకెళ్లి తీవ్రంగా కొట్టి గాయపరిచారు. బాధితుని తండ్రి వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దాడికి పాల్పడిన శ్రీశైలం, జగదీశ్వర్, మహేశ్ కుమార్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నియామకం




నాంపల్లి: తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నగర శాఖ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. నూతనంగా ఎన్నికైన నగర శాఖ కార్యవర్గానికి అధ్యక్షుడిగా పి.లక్ష్మణ్‌రావు, కార్యదర్శిగా జి.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. వీరి కార్యవర్గంలో సహాధ్యక్షుడిగా మహ్మద్ అతీక్ పాషా, ఉపాధ్యక్షులుగా జె.నాగరాజు, మహ్మద్ ముజీబ్, ఎస్.రాజేందర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సి.ఎస్.నాగరాజు, సంయుక్త కార్యదర్శిగా పి.శ్రీనివాస్, ధనలక్ష్మి, నోమ్‌రాజ్, కోశాధికారిగా బి.నాగరాజు, కార్యాలయ కార్యదర్శిగా జి.సీతమ్మ, ప్రచార కార్యదర్శిగా కె.రమేష్, ఎం.వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా ఎస్.నరేష్‌కుమార్, ఎ.మహేష్‌కుమార్, సి.శ్రీనివాస్, ఎస్.కుమార్, బి.శంకర్ ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద నిత్య అన్నదానం

గోల్కొండ: ప్రభుత్వ దవాఖానాలకు వచ్చే రోగులు, వారి సహాయకులకు ప్రతిరోజూ రాత్రి పూట అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రముఖ సంఘ సేవకుడు మహ్మద్ బషీర్ అన్నారు. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి సరోజీ కంటి ఆసుపత్రి, నీలోఫర్ పిల్లల ఆసుపత్రి, ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రికి వైద్య చికిత్సల నిమిత్తం ఇతర జిల్లాల నుంచి ప్రతి నిత్యం ఎందరో వస్తుంటారన్నారు. దాతలు, శ్రేయోభిలాషుల సహకారంతో వీరికి ప్రతిరోజూ రాత్రి భోజన ప్యాకెట్లుతో పాటు వాటర్ బాటిల్స్ అందిస్తున్నామని ఆయన తెలిపారు.

మజ్జిగ, తాగునీటి ప్యాకెట్ల పంపిణీ



గోల్కొండ: గోల్కొండ కోట వద్ద పర్యాటకులకు తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ వారు మజ్జిగ, తాగునీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు కోటకు వస్తుంటారని, తమవంతు బాధ్యతగా కృషి చేస్తున్నామని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ కార్యాలయ ఇన్‌చార్జి మహ్మద్ పహాద్ అన్నారు. శుక్రవారం టీఎఫ్‌సీఓ ఆధ్వర్యంలో గోల్కొండ కోట మొయిన్‌గేట్, డెక్కన్ పార్కు, సెవన్ టూమ్స్ చౌరస్తా వద్ద పర్యాటకులకు తమ ఆర్గనైజేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా చల్లటి తాగునీరు, మజ్జిగ అందజేసినట్లు తెలిపారు.

ప్రజా సేవకే జీవితం అంకితం

అబిడ్స్: ప్రజా సేవకే జీవితం అంకితమని ప్రముఖ సంఘసేవకుడు, వ్యాపారవేత్త ప్రకాష్ జైన్ పేర్కొన్నారు. నిరంతరం సమాజ సేవ చేస్తూ పేద బడుగువర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. శుక్రవారం జాంబాగ్ కాంగ్రెస్ ఇన్‌చార్జి సికే మూర్తి ఆయనను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాష్ జైన్ మాట్లాడుతూ..జాంబాగ్‌తో పాటు గోషామహల్ నియోజకవర్గంలో ప్రజా సేవా చేసేందుకు ముందుంటానన్నారు.


ప్రకాష్ జైన్‌ను సత్కరించిన సికే.మూర్తి

హనుమాన్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి


వీర హనుమాన్ విజయ యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నేతలు

పంజగుట్ట: హిందువుల ఎంతో పవిత్రంగా నిర్వహించుకునే హనుమాన్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), బజరంగ్‌దళ్ డిమాండ్ చేసింది. శ్రీరామనవమి, వినాయక ఉత్సవాల మాదిరిగా ఆంజనేయ స్వామి జయంతిని కూడా హిందూ సమాజం అంగరంగ వైభవంగా నిర్వహిస్తుందన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 23వ తేదీన వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న వీర హనుమాన్ విజయ యాత్ర పోస్టర్‌ను వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహమూర్తి, పండరీనాథ్, బజరంగ్ దళ్ రాష్ట్ర కీన్వనర్ శివరాములు ఆవిష్కరించారు. వీహెచ్‌పీ బజరంగ్ దళ్ నేతలు పగుడాకుల బాలస్వామి, వెంకటేశ్వర రాజు, సుభాష్ చందర్, కుమారస్వామి, మహేష్, వీరేశలింగం, రాహుల్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్ పార్టీని గెలిపించాలి: ఎమ్మెల్యే కౌసర్


ఇంటింటి ప్రచారంలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధికి చిరునామా అయిన మజ్లిస్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ తరఫున ఆయన శుక్రవారం కార్వాన్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మజ్లిస్ చేసిన అభివృద్ధి పనులు ప్రతి ఒక్కరికీ తెలుసని మజ్లిస్ పార్టీ గురించి కొత్తగా ఏమి చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో తాను ప్రతి డివిజన్, ప్రతి గల్లీలో అభివృద్ధి పనులు చేయించడం జరిగిందన్నారు. మజ్లిస్ పార్టీపై హైదరాబాద్ స్థానం నుంచి అసదుద్దీన్ గెలుస్తూ వస్తున్నారంటే ఆయనపై ప్రజలకు ఉన్న విశ్వాసం, ప్రేమాభిమానాలే కారణం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు అజీజ్‌ఖాన్ పఠాన్, హారూన్ ఫరాన్ తదితరులున్నారు.

చైతన్యఆనంద మహారాజ్‌ను కలిసిన ఉత్సవ సమితి నాయకులు


చైతన్య ఆనంద మహారాజ్‌తో సమావేశమైన గోవింద్‌రాఠి భగవంతరావ్, మెట్టు వైకుంఠం

అబిడ్స్: ఉత్తర భారతీయ ఆధ్యాత్మిక గురువు చైతన్యఆనంద మహారాజ్‌ను భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి నిర్వాహకులు గోవింద్‌రాఠి, డాక్టర్ భగవంతరావు, మెట్టు వైకుంఠం కలిశారు. గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు ఉత్సవ సమితి నాయకులు ఆనంద చైతన్య మహారాజ్‌ను కలిసి ఆయన ఆశీసులు పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..శ్రీరామ నవమి శోభాయాత్ర లక్షలాది మంది భక్తులతో విజయవంతంగా జరగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన





గన్‌ఫౌండ్రీ: భారతీయ శాస్త్రీయ సంగీత కళలు మన వారసత్వ సంపద అని పద్మశ్రీ అవార్డు గ్రహీత బీవీఆర్.మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో దీపాంజలి నృత్య శిక్షణాలయం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత నృత్య గురువు దీపికారెడ్డి వంద మంది శిష్యులు ఏక కాలంలో ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత కొన్నితరాలకు ఎంతో మంది చిన్నారులకు కూచిపూడి నృత్యాన్ని నేర్పిస్తున్న దీపికారెడ్డి కుటుంబసభ్యులను అభినందించారు. అనంతరం నృత్య గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సినీనటి సుమ కనకాల, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాప్‌లపై చర్యలు తీసుకోవాలి


ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదిరెడ్డి

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్ రవీంద్రనాయక్ నగర్‌లో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్టు షాప్‌లపై చర్యలు తీసుకోవాలని కాలనీ అధ్యక్షుడు ఎ.కృష్ణా నాయక్ కోరారు. ఈ మేరకు ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీలో ఉన్న నాలుగు బెల్టుషాప్‌ల నిర్వాహకులు ఉదయం 5 నుంచి రాత్రి 12 గంటల వరకు మద్యం విక్రయిస్తూ స్థానికులను తాగుబోతులుగా మారుస్తున్నారన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మందుబాబులతో స్థానికంగా చిన్నారులు, మహిళలు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. సీఐని కలిసిన వారిలో కిషన్, రాజేష్, రాజు, నరేందర్, మహేష్, వినోద్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

రామ్‌కోఠిలో శ్రీకృష్ణుడి విగ్రహం కలకలం

సుల్తాన్‌బజార్: శ్రీకృష్ణుడి విగ్రహం బయటపడిన సంఘటన సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. రామ్‌కోఠిలోని అమృత కపాడియా నవజీవన్ ఉమెన్స్ కళాశాల రెండేళ్లుగా మూసి వేశారు. ఈ బిల్డింగ్ విషయమై కోర్టులో కేసు నడుస్తుందని స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం కృష్ణుడి విగ్రహం బయటపడిందని వార్తలు వైరల్ కావడంతో స్థానికులు విగ్రహానికి పూజలు, నైవేద్యాలు సమర్పించారు. సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కళాశాల గేటు తాళంను పగలగొట్టి కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి చొరబడి కావాలనే విగ్రహాన్ని గోతి తవ్వి పెటెట్టారన్నది స్పష్టమైనది. భవనం విషయంలో కోర్టులో కేసు నడుస్తున్న నేపథ్యంలో ఇరు వర్గాలలోని ఎవరో ఒకరు ఈ పని చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

తెలంగాణలో బీజేపీ హవా



గోల్కొండ: ఈసారి పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ సత్తాచాటుతుందని ఆ పార్టీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు పాండుయాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన గుడిమల్కాపూర్ నుంచి కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రధాని మోదీ పరిపాలన దక్షతకు ప్రజలు మెచ్చుకుంటున్నారన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాల నుంచి భారీ మెజార్టీతో బీజేపీ అభ్యర్థులు గెలవడం ఖాయమన్నారు. ఆయన వెంట డిజ్వర్ సింగ్, గూడబొయిన శివ రత్న, కృష్ణా, ఓబీసీ మోర్చా గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింగ్‌రావు, వీరేందర్‌యాదవ్ తదితరులున్నారు.

జేఎన్ఏఎఫ్ఏయూ రిజిస్ట్రార్‌గా ప్రొ.మధుకర్



విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ జి.మధుకర్ నియమితులయ్యారు. ఇంతకు ముందు ఇక్కడ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన ప్రొఫెసర్ కొడాలి సుందర్‌కుమార్ అప్లయిడ్ ఆర్ట్స్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ..విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన గుణాత్మకమైన విద్యను అందించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు యూనివర్సిటీ ఉపాధ్యాయులతో కలిసి కృషి చేస్తానన్నారు.

కేసీఆర్ ఆత్మ విమర్శ చేసుకోవాలి


మాట్లాడుతున్న సంబు వెంకటరమణ


అబిడ్స్: కేసీఆర్ ఆత్మ విమర్శ చేసుకోవాలని రాష్ట్ర ఆర్య వైశ్య ఆఫీషియల్స్ ప్రొఫెషనల్ కార్యదర్శి సంబు వెంకటరమణ అన్నారు. ప్రజాస్వామ్యంగా గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏడాదిలోనే కూలగొడతామని కేసీఆర్ అనడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రతిపక్షాలలోనైనా ఫామ్‌హౌస్‌కి పరిమితం కాకుండా హుందాతనంగా ఉండాలన్నారు. ప్రజలు ఎందుకు ఛీకొట్టింద్రు అని అంతర్మథనం చేసుకోవాల్సిన మీరు మళ్లీ తప్పిదాలు చేస్తామని బహిరంగంగానే సంవత్సరంలో కాంగ్రెస్‌ను కూలగొడతామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మా వెంటే ఉన్నారనడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య రీజినల్ చైర్మన్ జూలూరు సత్యనారాయణ, వాసవి బృందం పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రగతిలో డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకం


పురస్కార గ్రహీతలతో వెంకటేశ్వర్లు తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మహా కవి సినారే కళాపీఠం ఆధ్వర్యంలో ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లను శుక్రవారం రవీంద్రభారతిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..ఆర్టీసీ ప్రగతిలో డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు నందిని సిద్దారెడ్డి, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైసా దేవదాస్, ఆర్టీసీ సికింద్రాబాద్ రీజినల్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ భీమ్‌రెడ్డి, సంస్థ కార్యదర్శి సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌కు ఆహ్వానం



చాంద్రాయణగుట్ట: మే నెల 1న ఉప్పుగూడలో నిర్వహించనున్న కార్మిక దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌ను బీఆర్ఎస్ కార్మిక విభాగం చాంద్రాయణగుట్ట నియోజకవర్గం నాయకుడు ఆకుల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయనను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. సాప కృష్ణ, గడుసు సాయిలు, నటరాజ్, నర్సింహా, లక్ష్మణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.